భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 42.0

కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.21 (సోమ)

సహారి : 4.47 (మంగళ)



భీమవరం పీఎస్ఎం పాఠశాలలో పరీక్ష కేంద్రం

విజయోస్తు

- నేటి నుంచి పది పరీక్షలు
- 128 పరీక్ష కేంద్రాలు
- 24,393 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి

భీమవరం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. జిల్లాలో 128 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. వీటిలో ఆరు పరీక్షా కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా నిర్ణయించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుంది. జిల్లాలో మొత్తం 24,393 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలి. 8.45 గంటల నుంచి పరీక్ష కేంద్రంలో విద్యార్థులను అనుమతిస్తారు. సహేతుక కారణాలతో సకాలంలో పరీక్షకేంద్రానికి చేరుకోలేకపోయిన విద్యార్థులకోసం 'అర్ధగంట' గ్రేస్ పీరియడ్‌ను నిర్దేశించారు. ఈ వెసులుబాటును నిత్యం వినియోగించుకునేవారిపై నిఘా ఉంచుతారు. విద్యార్థులు పరీక్ష కేంద్రంలోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదు. ప్రశ్నాపత్రం లీకేజీ లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రతీ ప్రశ్నపత్రానికి ఒక క్యూఆర్ కోడ్‌ను ఇచ్చారు. ప్రశ్నపత్రం ఎక్కడైనా లీకైతే కోడ్ ఆధారంగా సంబంధిత లీకేజీ ఏ పరీక్ష కేంద్రం నుంచి జరిగిందనేది వెంటనే తెలిసిపోతుంది. ఎండలు తీవ్రం కావడంతో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఉక్కపోత, తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత మండలాల ఎంఈవోలు, కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఆల్ ది బెస్ట్

పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్ష సమయానికి ముందుగానే వెళ్లాలి. తెలిసిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాసుకోవాలి. ప్రతి ప్రశ్న క్షుణ్ణంగా చదివి జవాబు ఇవ్వాలి. పరీక్ష సమయాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలి. ఉచిత బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోండి. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం.

- నారాయణ, డీఈవో



పది పరీక్షలకు కట్టుదిట్టమైన చర్యలు.. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ : ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆదివారం ఆయన మాట్లాడుతూ పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశామని, పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున బయట వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకున్నామని, పరీక్ష కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేంద్రాల్లో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవకతవకలు, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఇతర శాఖల సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేశామని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు, పరీక్షకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతర సిబ్బంది, వ్యక్తులుగాని ఉండరాదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా, పరీక్షల సమయంలో విద్యార్థులకు అత్యవసర పరిస్థితులు ఎదురైతే సహాయం కొరకు వెంటనే డయల్ 100/112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.



మావుళ్లమ్మకు గజమాల అలంకారం

మావుళ్లమ్మ అమ్మవారు గజమాలతో ప్రత్యేక అలంకరణలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. దాతలు అందించిన గజమాలను అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వరరావు పూజలు చేసి అమ్మవారికి అలంకారం చేశారు.

- భీమవరం టౌన్



ఇక ముహూర్తాలు లేవు!

రేపటి నుంచి శుభ కార్యాలకు విరామం

భీమవరం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లి బాజాల మోత పది రోజులపాటు ఆగనున్నాయి. సోమవారం ఉదయం 10.20 గంటల ముహూర్తం తర్వాత నుంచి శుభకార్యాలు ఆగిపోనున్నాయి. శుక్రమౌఢ్యం ప్రారంభంతో శుభకార్యాలు ఆగుతాయి. ఫిబ్రవరి 1 నుంచి మాఘ మాసం ప్రారంభంతో సోమవారం వరకు శుభకార్యాల జోరు కొనసాగింది. ప్రతీ పల్లెటూరులల్లో మంగళ వాయిద్యాలు మోగాయి. 18నుంచి శుక్రమౌఢ్యం కారణంగా 10 రోజుల పాటుముహూర్తాలు ఉండవని పండితులు తెలిపారు. ఉగాది దాటిన తరువాత జూన్ 10 వరకు శుభముహూర్తాలు ఉన్నాయి. దాదాపు రెండు నెలల పాటు జరగనున్నాయి. జూన్ 8 ఆఖరు ముహూర్తం కాగా జూన్ 10 నుంచి గురు మౌఢ్యం ప్రారంభంతో ముహూర్తాలు ఉండవని తెలిపారు. ఆషాఢ మాసం రావడంతో జూలై 25 వరకు ఉండవని, శ్రావణ మాసంతో తిరిగి మరలా ముహూర్తాలు ఉంటాయి.



చికెన్ ధర తగ్గింది

తణుకు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు తగ్గుముఖం పట్టడంతో ఆదివారం అమ్మకాలు కొంతవరకు పెరిగాయి. గత రెండు వారాలతో పోల్చితే ఈ వారం అమ్మకాలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. బర్డ్‌ఫ్లూ కారణంగా వేల్పూరు, బాదంపూడి, కానూరు గ్రామాల్లో రెడ్‌జోన్ ప్రకటించి చికెన్ వినియోగంపై ఆంక్షలు విధించారు. వైరస్ ప్రభావం తగ్గడంతో చికెన్, కోడిగుడ్లను తినవచ్చంటూ ఈనెల 1 నుంచి అధికారులు, పౌల్ట్రీ యజమానులు, నెక్ సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలోని పలుచోట్ల చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ఫలితంగా గత రెండు వారాలుగా చికెన్ అమ్మకాలు సాగుతున్నా అంతంత మాత్రం. గత వారం కిలో లైవ్ చికెన్ ధర రూ.80 నుంచి రూ.90 మధ్య ఉండగా ఈ వారం రూ.75 నుంచి రూ.80 మధ్య ఉంది. చికెన్ రిటైల్‌గా స్కిన్‌తో రూ.139 స్కిన్‌లెస్ రూ.159 అమ్మకాలు సాగాయి. చికెన్ ధరలు తగ్గడంతో పాటు చికెన్ వినియోగంపై అపోహలు కూడా తొలగిపోవడంతో అమ్మకాలు పెరిగాయి. ఈ మేరకు మటన్ అమ్మకాలు స్వల్పంగా తగ్గాయి. చికెన్ కొనుగోలు వినియోగదారులు వెనకాడడంతో మటన్ ధర ఒక్కసారిగా కేజీ రూ.వెయ్యి పలికింది. జిల్లాలో ఇప్పటికీ అదే ధరకు అమ్మకాలు సాగుతున్నాయి.



రెండు సచివాలయాలు ఒకటిగా..

క్లస్టర్ సేవలు

- పట్టణాలు, గ్రామాల్లోనూ మార్పులు
- ప్రభుత్వ కీలక నిర్ణయం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సచివాలయాలను క్లస్టర్‌లుగా మార్పు చేయనున్నారు. ప్రతి రెండు సచివాయలాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేస్తారు. సిబ్బందిని ఇతర అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో 535 సచివాలయాలు ఉన్నాయి. ఒక గ్రామంలో ఒకే సచివాలయం ఉంటే సమీప గ్రామంలోని సచివాలయాన్ని కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తారు. పట్టణం, మండలం యూనిట్‌గా క్లస్టర్లను ఏర్పాటుచేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మిగులు సిబ్బందిని ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. వీఆర్వోలు అధికంగా మిగులు సిబ్బంది జాబితాలో చేరనున్నట్టు ఇప్పటికే చర్చ నడుస్తోంది. వీఆర్వోల జిల్లా సంఘం ఈ విషయమై ఆందోళన వ్యక్తం చేసింది. మిగులు సిబ్బందిని ఏమి చేస్తారంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. సచివాలయాల్లో సిబ్బంది మొత్తాన్ని వివిధ రూపాల్లో వినియోగించుకోవడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వాస్తవానికి ప్రతి సచివాలయంలో 10 మంది సిబ్బంది ఉండేలా గత ప్రభుత్వం నియామకాలు చేపట్టింది. ఆవిధంగా చూస్తే జిల్లాలోని 535 సచివాలయాలకు 5350 సిబ్బంది ఉండాలి. జిల్లాలోని అన్ని సచివాలయాల్లోనూ ప్రస్తుతం 4200 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత లేకుండా ఉండేలా క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నారు.

సచివాలయంలో సిబ్బంది వీరే..

ప్రతి సచివాలయంలో నలుగురు సిబ్బంది తప్పనిసరిగా ఉంటారు. పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉండేలా ప్రభుత్వం ప్రణాళిక రచించింది. మిగిలిన సిబ్బంది మాత్రం క్లస్టర్‌కు ఒకరు మాత్రమే అందుబాటులో ఉంటారు. అంటే రెండు సచివాలయాల పరిధిలో ఒకరు సేవలందిస్తారు. రెండింటిలో ప్రస్తుతం ఒక కార్యదర్శి మాత్రమే ఉంటే సదరు సచివాలయంలోనే కొనసాగుతారు. క్లస్టర్ పరిధిలోని ప్రజలు అదే సచివాలయానికి సంబంధిత సేవలు పొందేందుకు వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా వ్యవసాయం, ఫిషరీస్, విద్యుత్ అసిస్టెంట్‌లు, సర్వేయర్, విఆర్వో, ఉద్యానవనం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అసిస్టెంట్‌లు క్లస్టర్ పరిధిలోని ఏదో ఒక సచివాలయంలో విధులు నిర్వహిస్తారు. రెండు సచివాలయాల్లోనూ సిబ్బంది ఉంటే వారిని తప్పించి ఇతర విధులను అప్పగిస్తారు. అర్హత ఆధారంగా ప్రభుత్వ శాఖలకు బదిలీ చేస్తారు.

ఉదాహరణకు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల విషయానికొస్తే వారి విద్యార్హత ఆధారంగా ఆర్‌అండ్‌బి, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ ఇలా ఏదో ఒక శాఖలో నియమిస్తారు. పట్టణ ప్రణాళిక, వీఆర్వోలను మాతృశాఖలు అంటే మున్సిపాలిటీల్లోని పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ శాఖలకు బదిలీ చేసే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం తుది మార్గదర్శకాలను విడుదల చేయనుంది. మిగులు సిబ్బందిపై తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. దీనివల్ల సచివాలయ సిబ్బందికి పనితనం ఉంటుంది. మాతృశాఖకు వెళ్లిన వారికి సంతృప్తి ఉంటుంది.

స్వర్ణాంధ్ర కోసం ఐదుగురు

ప్రభుత్వం స్వర్ణాంధ్ర -2047 విజన్ అమలు చేస్తోంది. ప్రతి నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా జిల్లా స్థాయి అధికారిని నియమించింది. వారి పరిధిలో ఐదుగురు సిబ్బందిని నియమించనున్నారు. సచివాలయాల్లో మిగులు సిబ్బందిని స్వర్ణాంధ్ర విజన్ విధుల్లో వినియోగించనున్నారు. సచివాలయ సిబ్బందిని సర్దుబాటు చేసే దిశగా ప్రభుత్వ నిర్ణయంతో త్వరలోనే క్లస్టర్ విధానం అమలులోకి రానుంది. జిల్లా అధికారులు సైతం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.



హలో.. భీమవరం

పట్టణంలో నితిన్, శ్రీలీల సందడి

హలో.. భీమవరం.. హాయ్ అందరూ ఎలా ఉన్నారు అంటూ రాబిన్‌హుడ్ చిత్రం హీరో హీరోయిన్లు నితిన్, శ్రీలీల పట్టణంలో ఆదివారం సందడి చేశారు. చిత్రం పమోషన్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కల్చరల్ ఫెస్ట్‌లో వారు పాల్గొన్నారు. నితిన్, శ్రీలీల కళాశాలలో చదివిన రోజుల్లో పలు సంఘటనలు విద్యార్థులతో పంచుకున్నారు.

7

స్వయం ఉపాధికి ఊపిరి

యువతకు సబ్సిడీపై రుణాలు

వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు పూర్తిగా పక్కన పెట్టిన స్వయం ఉపాధి రుణాలకు ప్రస్తుత ప్రభుత్వం ఊపిరిలూదుతోంది. ఉద్యోగం లేక, ఉపాధి కోసం రుణం అందక ఇబ్బంది పడుతున్న యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు రంగం సిద్ధం చేస్తుంది. రుణాల మంజూరు, యూనిట్ల కేటాయింపుపై జిల్లాల వారీగా అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది.

- రుణాలు, యూనిట్ల స్థాపనపై లక్ష్యాలు
- మహిళలకు శిక్షణ, ఉపాధి కల్పన

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పశ్చిమలో బీసీలకు స్వయం ఉపాధి సోపానం కింద 1901 మందికి రూ.72.98 కోట్లు, ఏలూరు జిల్లాలో 1901 మందికి రూ.72.98 కోట్లు రుణ సదుపాయం కల్పించేందుకు బీసీ కార్పొరేషన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటితోపాటు బి ఫార్మా పూర్తిచేసిన యువకులు జనరిక్ మందుల షాపులు నిర్వహించేందుకు కూడా రెండు జిల్లాలకు కలిపి 77 యూనిట్‌లు నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటున్నారు. యువతకు ఉపాధి కల్పించడంతోపాటు పేదలకు తక్కువ ధరకు మందులు అందించే ప్రయత్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది.



మహిళలకు శిక్షణ.. కుట్టు మిషన్లు

మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న కుట్టు మిషన్లు కూడా ప్రభుత్వం అందించనుంది. అందుల్లో భాగంగానే పశ్చిమలో 4589 మందికి, ఏలూరు జిల్లాలో 4569 మందికి శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్లు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది.

చేతి వృత్తుల వారికి..

చేతి వృత్తులు చేసుకునే మేదర, కుమ్మరి శాలివాహన కులాలకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించి వారికి వృత్తులను ప్రోత్సహించనున్నారు. మరుగున పడిపోతున్న చేతి వృత్తులనే రాబోయే తరాలకు అందించాలనే ఉద్దేశంతో ముగ్గురు కలిపి ఒక యూనిట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో యూనిట్‌కు 50 శాతం సబ్సిడీపై రూ.3లక్షల రుణం అందించనున్నారు. చేతి వృత్తుల వారికి పశ్చిమగోదావరి జిల్లాకు 145, ఏలూరు జిల్లాకు 145 యూనిట్‌లకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు.

కాపు కార్పొరేషన్ రుణాలు

కాపు యువతకు స్వయం ఉపాధి లక్ష్యంతో 50శాతం సబ్సిడీపై పశ్చిమలో 694 యూనిట్‌లకు రూ.23.31 కోట్లు, ఏలూరు జిల్లాలో 693 యూనిట్‌లకు 23.28 కోట్లు రుణాలు అందించేందుకు లక్ష్యం నిర్దేశించారు. వాటితోపాటు అగ్రవర్ణ కులాలైన కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ ఆర్యవైశ్య కులాలకు ప్రత్యేక ఆర్థిక పరిపుష్టి అందించే దిశగా పశ్చిమలో 215 యూనిట్‌లకు రూ.4.30 కోట్లు, ఏలూరు జిల్లాలో 215 యూనిట్‌లకు రూ.4.30 కోట్ల రుణాలు అందించనుంది. వీటితోపాటు ఎంఎస్‌ఎంఈ రుణాల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం కల్పించేందుకు నిధులు విడుదల చేయనున్నారు.



తాడేపల్లిగూడెం ప్రధాన రహదారి

సన్ డే

ఉమ్మడి పశ్చిమలో పెరిగిన పగటి ఉష్ణోగ్రత

నేడు వేడి గాలులపై హెచ్చరికలు

ఏలూరు సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరాయి. ఎండలతో ప్రజలు విలవిల్లాడారు. జంగారెడ్డిగూడెం, పోలవరంలో అత్యధికంగా 43 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు కాగా ఏలూరు, చింతలపూడి, తాడేపల్లిగూడెం, భీమవరం, కొవ్వూరు, నిడదవోలు, నరసాపురం ప్రాంతాల్లో 42 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో 40 నుంచి 37 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఇప్పటికే జిల్లాలో వారంరోజులుగా వేసవి వేడిగాలుల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. ఉష్ణోగ్రతల తీవ్రతతో పగటి పూట రహదారులపై ప్రయాణించడం కష్టతరంగా తయారైంది. ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు.

వేడిగాలులపై ముందస్తు హెచ్చరిక

ఉమ్మడి పశ్చిమలో ఈనెల 17 వరకు వేడిగాలుల తీవ్రత ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. దీనికనుగుణంగా ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆరు మండలాలు, ఏలూరు జిల్లాలోని 16 మండలాల్లో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. 17న పశ్చిమలో 3 మండలాలు, ఏలూరు జిల్లాలో 14 మండలాల్లో వేడిగాలుల తీవ్రత ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. ఏలూరు జిల్లాలోని ఆగిరిపల్లి, భీమడోలు, బుట్టాయగూడెం, ద్వారకాతిరుమల, ఏలూరు, గణపవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు, నిడమర్రు, పెదవేగి, పోలవరం, టి.నరసాపురం, ఉంగుటూరు, వేలేరుపాడు మండలాలు, పశ్చిమగోదావరి జిల్లాలోని పెంటపాడు, తాడేపల్లిగూడెం, తణుకు మండలాల్లో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరించింది.

ఉమ్మడి పశ్చిమలో ఆదివారం నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు

ఏలూరు	42/20	నరసాపురం	42/20
జంగారెడ్డిగూడెం	43/19	నిడదవోలు	42/20
చింతలపూడి	42/20	కొయ్యలగూడెం	40/19
పోలవరం	43/19	తణుకు	40/21
తాడేపల్లిగూడెం	42/20	ఆకివీడు	40/21
భీమవరం	42/20	పాలకొల్లు	37/22



రక్తదాన శిబిరం ప్రారంభించిన జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

భీమవరం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆదివారం పలువురు అధికారులు నివాళులర్పించారు. ఏవో రాజశేఖర్, బీసీ సంక్షేమ శాఖాధికారి జి.గణపతిరావు, ఏఎస్‌డబ్ల్యూ కె.వెంకటేశ్వర రావు, తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ భవనంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభి నందనీయమన్నారు. అత్యవసర వైద్య సేవలు పొందే వారికి రక్తం ఎంతో అవసరమని, దీన్ని అందరూ గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు రావాలని జేసీ సూచించారు. పలుసార్లు రక్తదానం చేసిన సమయమం తుల నానిని జేసీ, సంఘ సభ్యులు సత్కరించారు. జూలూరి వెంకటేష్, వబిలిశెట్టి వెంకటేశ్వరావు, తటవర్తి బదిరీ నారాయణ, వబిలిశెట్టి కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

తణుకు పట్టణ రూపురేఖలు మారుస్తాం : ఎమ్మెల్యే రాధాకృష్ణ



తణుకు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనతో తణుకు రూపురేఖలు మారనున్నాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. నిర్ణీత సమయంలో నిధులు ఖర్చుచేసేవిధంగా సీఎం చంద్రబాబు సూచనలు చేశారన్నారు. ఎన్టీఆర్ పార్క్, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, ఐక్యనగర్ పార్కు అభివృద్ధిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామన్నారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విధంగా రాష్ట్రపతి రోడ్డుకు సమాంతరంగా జీ అండ్ వి కెనాల్ బండ్ రోడ్డు అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. కార్యకర్తలతో చంద్రబాబు సమావేశం నూతనోత్తేజాన్ని నింపిందన్నారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ సోషల్ మీడియాలో రోడ్ షోలో జనం లేరని వీడియోలు పెట్టారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రోడ్ షో నిర్వహించలేదని, జన సమీకరణ లేదన్నారు. ప్రజలు వాహనదారులు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చంద్రబాబు పర్యటన సాగిందన్నారు. గతంలో జడ్పీ హైస్కూల్‌లో జగన్ సభకు రోడ్డుపై చెట్లు నరికేశారు. పరదాలు, బారికేడ్లు కట్టుకుని వ్యాపారులు, ప్రజలను ఇబ్బందులు పెట్టిన విషయాన్ని ప్రజలకు గుర్తు ఉందన్నారు. చంద్రబాబు పర్యటన విజయవంతం చేసిన అధికార యంత్రాంగం, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

మంచు కురిసే వేళలో..



తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి హైవేపై మంచు సోయగం



ఆకివీడులో..

లింగపాలెంలో..

ఆరుగొలను వద్ద మంచు తెర మాటున రైల్వే ట్రాక్



ఉండిలో..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆదివారం ఉదయం పొగమంచుతో ప్రకృతి ఆహ్లాదకరంగా కనిపించింది. పచ్చని చేలు, హైవేపై మంచు దుప్పటి కప్పుకుని కనువిందు చేసింది. ఎనిమిది గంటల వరకు మంచుతో తడిసిన ప్రకృతి పులకించింది. ఉదయం సమయాన్ని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించారు. మరోవైపు ఉదయం 11 గంటల నుంచే ఎండలు ఠారెత్తాయి. భానుడు ఉగ్రరూపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

– న్యూస్ నెట్‌వర్క్

సన్‌డే ఎండలు



కామవరపుకోటలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు



తాడేపల్లిగూడెంలో..

ముదినేపల్లిలో



ద్వారకాతిరుమలలో చెట్ల కింద సేదతీరుతున్న శ్రీవారి భక్తులు

ఉండిలో చెట్టు కింద కూర్చున్న కూలీలు



భీమవరంలో హీరో, హీరోయిన్ నితిన్, శ్రీలీల డ్యాన్స్.. హీరో అభివాదం

భీమవరంలో 'రాబిన్ హుడ్' సందడి

ఎస్ఆర్‌కేఆర్ కాలేజీలో అలరించిన హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల

భీమవరం అర్బన్, మార్చి16 (ఆంధ్రజ్యోతి) : హాయ్..హాలో.. ఎలా ఉన్నారు బాగున్నారా.. అంటూ సినీ హీరో నితిన్ భీమవరంలో సందండి చేశారు. మైత్రీ మూవీస్ బ్యానర్‌పై నితిన్, శ్రీలీల జంటగా నటించిన రాబిన్ హుడ్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. హీరో మాట్లాడుతూ 'నేను చదువుకునే రోజుల్లో ఎగ్జామ్ పేపర్స్‌ను దొంగిలించానని.. తర్వాత మా ఆవిడ హృదయాన్ని కూడా దొంగలించానన్నారు. హీరోయిన్ మాట్లాడుతూ 'నేను హాస్టల్లో ఉండే సమయంలో మేకప్ కిట్‌లు దొంగలించానని చమత్కరించారు. అనంతరం డ్యాన్స్‌లు వేశారు. కార్యక్రమంలో మైత్రీ మూవీ అధినేత రవిశంకర్, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలయ అధికారులు అందించిన బాండుపత్రాన్ని చూపిస్తున్న దాత కుటుంబం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.3 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుని కుటుంబం ఆదివారం రూ.మూడు లక్షలను విరాళంగా అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కేసరపల్లికి చెందిన జాస్తి మధుకల్యాణ్ ఈ విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాత కుటుంబానికి విరాళం బాండు పత్రాన్ని అందించారు. శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

- ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్
- నేడు విధుల బహిష్కరణకు ఆరోగ్యమిత్రల పిలుపు

ఏలూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధనకు ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పనిచేస్తోన్న ఆరోగ్యమిత్రలు చేపట్టిన దశల వారీ ఆందోళనలో భాగంగా సోమవారం విధుల బహిష్కరణకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద నమోదైన 63 నెట్‌వర్క్ ఆసుపత్రులుండగా, వీటిలో 120 మంది ఆరోగ్య మిత్రలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రోజుకు సగటున 300 మందికిపైగా రోగులు వైద్యచికిత్సలు, సలహాల నిమిత్తం వస్తుంటారు. ఈవిధంగా ఆసుపత్రికి వచ్చే రోగిని ఔట్ పేషెంట్ కింద ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసుకుని, సంబంధిత వైద్య నిపుణుని వద్దకు తీసుకెళ్లి వైద్యసేవలందేలా చూడడం ఆరోగ్య మిత్రల విధి. మలి విడత అందోళనలో భాగంగా సోమవారం విధుల బహిష్కరణకు పిలుపునివ్వడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేశామని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు అదనపు సీఈవో ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఓబుల్‌నాయుడు, జేఈవో రామ్‌గోపాల్ ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యమిత్రల ఆందోళనకు చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై జూమ్ మీటింగ్ నిర్వహించి సూచనలు చేశారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS AJC
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

GOLD FINANCE
బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం.
(స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-209326

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిములతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మిందించిన క్లెయిమ్‌లకు, ఇతర మోసాలకు ప్రకటనదారులతో జరుపు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ



టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, తదితరులు

భీమవరంలో టెన్నిస్ పోటీలు ప్రారంభం

భీమవరం అర్బన్, మార్చి16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అని రాష్ట్ర పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం సాయంత్రం బెలూన్లను ఎగురవేసి ప్రారంభించారు. పోటీల నిర్వహణకు క్లబ్ సభ్యులతోపాటు, దాతల సహకారం ఎనలేనివన్నారు. క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు, పీవీ రామరాజు మాట్లాడుతూ మెన్స్ డబుల్స్ 35+,45+,55+,64+,70+,75+ విభాగాల్లో జరిగే పోటీలు ఈనెల 21వరకు జరుగుతాయన్నారు. టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.రాంబాబు మాట్లాడుతూ పోటీల్లో తమిళనాడు,కర్ణాటక, బెంగళూరు, ఒడిశా, తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. కాస్మోక్లబ్ సభ్యులు యూఆర్ పీఆర్ వర్మ, కె.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌కు ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు

నల్లజర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా పులివెందులలో ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి 34వ కబడ్డీ పోటీలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ జట్టు సెమీఫైనల్ చేరినట్టు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. తొలుత గుంటూరు, కర్నూలు జట్లపై విజయం సాధించింది. అనంతరం శ్రీకాకుళం జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరినట్టు కోచ్ జి.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఫైనల్స్ ప్రకాశం జిల్లా జట్టుపై ఆడుతుందని ఆయన తెలిపారు.

క్రైం వార్తలు

బ్యాంక్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

- రైలు ఢీకొని మృతి చెందాడని ప్రాథమిక నిర్ధారణ



నవీన్‌సాగర్ (ఫైల్)

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో పనిచేసే ఒక ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో రైలుపట్టాలు సమీపంలో మృతి చెందాడు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు, రైల్వే పోలీసులు పరిశీలించి ప్రాథమికంగా రైలు ఢీకొనడం వల్లే మరణించాడని నిర్ధారణకు వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరు ఇజ్రాయిల్ పేటకు చెందిన సందోలు నవీన్‌సాగర్ (43) పెదవేగిలోని చైతన్య గోదావరి బ్యాంకులో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన సత్రంపాడులో ఉంటున్నారు. ఆయనకు భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్దకుమార్తె బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. రెండో కుమార్తె ఇంటర్ చదువుతోంది. ఈనెల 15న యథావిధిగా బ్యాంక్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తూ సీఆర్‌ఆర్ కాలేజీ సమీపంలో బైక్‌పై పెట్టి రైలు పట్టాలపై బహిర్భూమికి వెళ్లారు. ఆ సమయంలో రైలు ఢీ కొనడంతో అతను ఎగిరి రైలు పట్టాల దిగువ భాగానికి పడిపోయారు. అతను రాత్రి అంతా రాలేదని కుటుంబ సభ్యులు, బంధువులు వెతకగా బైక్ సీఆర్‌ఆర్ కాలేజీ సమీపంలో కనిపించింది. దిగువ భాగాన మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కోటేశ్వరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మరోవైపు పోలీసు జాగిలంతో పరిశీలన చేయించారు. ఈ నేపథ్యంలో అతను పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొందని నిర్ధారణకు వచ్చారు. రైల్వే ఎస్ఐ పి. సైమన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ ట్యాక్సీ డ్రైవర్ మృతి

ఏ కారణమో తెలియదు కాని పురుగుల మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తణుకులో నరేంద్ర సెంటర్‌కు చెందిన మాడుగు సోమేశ్వరరావు (36) ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య రమ్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈనెల 13న ఏ కారణమో తెలియదు కాని పురుగుల మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని తొలుత తణుకు ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతను ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తణుకు పోలీసులు వచ్చి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.



ఆచంటేశ్వరుడి సన్నిధిలో దేవదాయ శాఖ మంత్రి ఆనం, ఎమ్మెల్యే పితాని

ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం

ఆచంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను నిర్వహిస్తామని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆచంట ఆచంటేశ్వరుని స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన మంత్రిని అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు. దర్శనం అనంతరం గొడవర్తి శ్రీరాములు గంధర్వ మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ప్రజలకు ఇంకా చేరువయ్యేలా మంచి జరగాలని ఆచంటేశ్వరుని కోరుకున్నానన్నారు. గోదావరి పుష్కరాలకు ముందే అఖండ గోదావరి ప్రాజెక్టును నెలకొల్పుతామని, సీఎం ఆధ్వర్యంలో ప్రణాళికలు చేపడుతున్నట్టు తెలిపారు. అంతర్వేదిలో ఉన్న రథకం కాలిపోయినా ఘటనపై శాసన మండలిలో తాను చర్చించడం బాధ కలిగించిందన్నారు. సోమవారం అంతర్వేది పుణ్య క్షేత్రాన్ని సందర్శిస్తానన్నారు. దేవాలయాల అభివృద్ధికి, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకునే విధంగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆచంటలో పురాతనమైన ముత్యాలమ్మ ఆలయ పునఃనిర్మాణానికి సంబంధిత అధికారులను పంపించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామన్నారు. గొడవర్తి శ్రీరాములు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, అధికారులు, ఈవో ఎ.వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

22నుంచి నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు, తదితరులు

దేవరపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఈనెల 22నుంచి 25 వరకు నిర్వహిస్తామని పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశంలో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ ఈ పుణ్యక్షేత్రం ప్రారంభించి 40 ఏళ్లయిందని, 2000 సంవత్సరంలో నిర్మలగిరి క్షేత్రంలో ప్రధాన దేవాలయం నిర్మించి 25 ఏళ్లయిన సందర్భంగా ఈ ఏడాది సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, చిన్నారులు, వృద్ధులకు పాలు, మజ్జిగతో పాటు నిత్యఅన్నదానం జరుగుతుందన్నారు. భక్తులకు శాంతి కలిగేందుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామన్నారు. 250 మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలతో ఏర్పాటుతో పాటు పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహిస్తారన్నారు. పుణ్యక్షేత్ర సందర్శనకు ఉభయ రాష్ట్రాల నుంచి పది లక్షల వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అనంతరం పొలిమేర జయరావును పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, నిత్య అన్నదాన కాంట్రాక్టర్ కళ్ళేపల్లి నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. రెవరెండ్ ఫాదర్లు పి.బాల, డి.ఆరోన్ తదితరులు పాల్గొన్నారు.



'అసత్యం' నాటికలో సన్నివేశం

స్ఫూర్తిదాయకంగా నాటిక ప్రదర్శనలు

పాలకొల్లుఅర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన జాతీయస్థాయి నాటక పోటీలలో రెండో రోజు ఆదివారం స్ఫూర్తిదాయకమైన మూడు నాటికలు ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనగా హైదరాబాద్ వారి 'ఇది రహదారి కాదు' నాటికలో సముద్రాలుగా బి.నాగరాణి, సూరీడుగా బి.దేవేష్, కిషోర్‌గా సీహెచ్ జగదీష్, నాగుగా మంజూనాథ్, పార్థుగా టి.సుజిత్, రైలు బాబాయ్‌గా ఎస్ఎం బాషా, దివ్యగా పూజిత సింధూరి నటించగా, సంగీతాన్ని సురభి నాగరాజు, లైటింగ్‌ను నోరి రామ్మోహన్, సెట్‌ను అర్షద్, నోరి రామ్మోహన్, ఆహార్యంను పి.గిరిధర్, కాగా రచన ఆకురాతి భాస్కరరావు, ఎస్ఎం భాషా దర్శకత్వం వహించారు. కథాసారాంశం ఇలా.. వివాహ వ్యవస్థపై దారి తప్పుతున్న యువతను చక్కదిద్దే విధంగా కథను మలిచిన తీరు ఆకట్టుకుంది.

- రెండో ప్రదర్శనగా కళాస్రవంతి (విశాఖ) ప్రదర్శించిన 'అసత్యం' నాటికకు కథను శ్రీసుధ మోదుగు అందించగా, నటాకీకరణను పిన్నమనేని మృత్యుంజయరావు, దర్శకత్వాన్ని పి.బాలాజీ నాయక్, నటవర్గం : వివయ్యగా పి.బాలాజీ నాయక్, బసవయ్యగా ఎ.రామారావు, రఘుపతిగా వై.అనిల్ కుమార్, కనకయ్యగా ఎం.వాసు, వెంకట్రావుగా థామస్, పార్వతిగా ఎస్.మాధవి అభినయించగా, సంగీతాన్ని పి.తులా మోహన్, ఆహార్యం థామస్, రంగాలంకరణను ఎం.సత్తిబాబు, థామస్ సమకూర్చారు. కథాసారాంశం ఇలా.. దైవత్వమైనా, రాక్షత్వమైన, స్వార్థమైనా, పరమార్థమైనా అది మనిషి హృదయంలో ఉంటుంది. ప్రతి సత్యం వెనుక అసత్యం.. ఏది సత్యమో, ఏది అసత్యమో కంటికి కనిపించేదంతా సత్యం కాదు. కనిపించనిదంతా అసత్యం కాదు, కథాంశంతో రూపొందించిన కథను పాత్రధారులు నటనా ప్రతిభతో ప్రేక్షకులను అలరించారు.
- మూడో ప్రదర్శనగా శ్రీమద్దుకూరి క్రియేషన్స్ (చిలకలూరిపేట) వార 'మా ఇంట్లో మహాభారతం' నాటికను ప్రదర్శించారు.



పరీక్ష రాసేందుకు వెళుతున్న అభ్యర్థులు

ఏపీపీఎస్సీ పరీక్ష ప్రశాంతం

- 134 మంది హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో గైర్హాజరీల సంఖ్య అధికంగా ఉంది. వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల పరీక్ష కేంద్రానికి 180 మంది అభ్యర్థులను కేటాయించగా 74 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 120మందిని కేటాయించగా 60 మంది హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలవకొలను తులసి

నరసాపురంలో 21 నుంచి హస్తకళల ప్రదర్శన

- లేసు ట్రేడింగ్ సెంటర్ కన్వీనర్ తులసి

నరసాపురం రూరల్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): రుస్తుంబాద లేసు ట్రేడింగ్ సెంటర్‌లో ఈనెల 21 నుంచి 25 వరకు ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హస్తకళల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు లేస్ ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసి తెలిపారు. అదివారం ట్రేడ్ సెంటర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ప్రదర్శనకు పలు రాష్ట్రాల నుంచి వంద మందికిపైగా చేతివృత్తిదారులు హాజరవుతున్నారన్నారు. 80 స్టాల్స్ ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రదర్శనలో హస్తకళల ఫ్యాషన్, జ్యూయలరీ, గృహోపకరణాలు, హోం పర్నీచర్, లేసు ఉత్పత్తులు, కలంకారీ శారీస్, తదితర వస్తువులను ప్రదర్శిస్తామన్నారు. ఎగ్జిబిషన్‌ను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నాయకర్, పితాని సత్యనారాయణ పాల్గొంటారన్నారు. సమావేశంలో కలవకొలను తాతాజీ, రాజీవ్ పాల్గొన్నారు.



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ

పొట్టి శ్రీరాములు జయంతి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు డాక్టర్ బి.గోవిందరాజులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తణుకు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరంలోని బౌద్ధ దమ్మపీఠంలో ప్రతి నెలా మూడో సోమవారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరం నేడు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని ఉండ్రాజవరం, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 85007 68009లో సంప్రదించాలన్నారు.

పలాస, విశాఖకు బస్సు సర్వీసులు ప్రారంభం

భీమవరం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందించటంలో ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, భీమవరం డిపో నుంచి పలాసకు ఒక సర్వీసు, విశాఖపట్నంకు మరో సర్వీసును ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. ఆదివారం రాత్రి భీమవరం బస్ కాంప్లెక్స్‌లో రెండు సర్వీసులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ, సీఐ సురేష్, కోళ్ళ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల సహకారంతో గ్రామాల అభివృద్ధి


బ్రెయిలీ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జన్మభూమికి ప్రవాసాంధ్రులు సహకరిస్తే గ్రామాలు అభివృద్ధి వైపు పయనిస్తాయని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కేశవరంలో ఉండి పంట కాల్వపై పునఃనిర్మించిన బ్రెయిలీ బ్రిడ్జిని ఆదివారం ఆయన ప్రారంభించారు. గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు దండు సత్యనారాయణరాజు రూ.10 లక్షల ఆర్థిక సాయంతో ఈ బ్రిడ్జిని పునఃనిర్మించడం స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు, సర్పంచ్ కామేశ్వరి, పురప్రముఖులు దండు వాసురాజు, మిడతాని నాగేశ్వరరావు, ఎంపీడీఓ బేబిశ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

తణుకు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తన క్యాంపు కార్యాలయంలో 17 మందికి రూ. 23 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలో భాగంగా వైద్య చికిత్స రూ. 2.50లక్షలు దాటిన ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల బీమాతో కుటుంబాన్ని ఆదుకునే విధంగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. క్యాన్సర్, కాలేయ సంబంధిత వ్యాధులకు సైతం బీమా ద్వారా వైద్యం చేయించుకునే అవకాశం కల్పించి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు. వైసీపీ హయాంలో సీఎం సహాయనిధి కోసం ఎదురు చూపులే మిగిలేవన్నారు.

లోసరిలో రూ. 3.15 కోట్లతో సబ్ స్టేషన్


శంకుస్థాపన చేస్తున్న అంజిబాబు, సీతారామలక్ష్మి

భీమవరం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శివారు గ్రామాల్లో ఇకలో ఓల్టేజ్ సమస్య ఉండదని, వాటి పరిష్కారానికే 33/11 కెవి సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం లోసరిలో రూ. 3 కోట్ల 15 లక్షలతో 33/11 కెవి సబ్ స్టేషన్‌కు ఎమ్మెల్యే అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉప కేంద్రంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని, బర్రెవానిపేట, దొంగపిండి, గరివిడిదిబ్బ, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, లోసరి, తోకతిప్ప, నాగేంద్రపురం, నాగిడిపాలెం గ్రామాలకు ఎంతో లబ్ధిపొందుతాయని అన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణలపై చర్యలకు వినతి

భీమవరం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికను ఆక్రమించి చెరువులు తవ్వేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని దిరుసుమర్రు గ్రామస్థులు సుమారు 50 మంది ఎమ్మెల్యే అంజిబాబును ఆయన క్యాంప్ కార్యాలయంలో కలసి విజ్ఞప్తి చేశారు. ఐదు ఎకరాల భూమి ఐదు కులాలకు ఉపయోగపడే శ్మశానవాటికను ఆక్రమించి చెరువులు తవ్వడం సరికాదని, దీనిని నిలుపుదల చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

నరసాపురం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుస్తుంబాదా మంగళగుంటపాలెం జగనన్న కాలనీలో డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేయాలంటూ ఆదివారం సీపీఎం ధర్నా నిర్వహించింది. కాలనీలో 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, అయితే కాలనీ వాసులు రహదారులు, కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం కాలనీలో సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

19న అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా

భీమవరం అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19వ తేదీన విజయవాడలో తలపెట్టిన అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి యాత్రను జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ బాధిత సంఘ సభ్యుడు ఎం. సీతారాం ప్రసాద్ కోరారు. భీమవరం, ఉండి నియోజకవర్గాలకు చెందిన బాధితుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ ప్రభుత్వంలోనైనా డిపాజిట్ల సొమ్ము పూర్తిగా చెల్లించి న్యాయం చేయాలన్నారు. ఏవీ రాంబాబు, పి. నరసింహాచారి, బి. సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం



కాళ్ళ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండలం సీసలి షిర్డీ సాయిబాబా ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి అడవికొలనుకు చెందిన నారిన వెంకటేశ్వరరావు, పుష్ప దంపతుల కుమార్తె సౌమ్యశ్రీ రూ. 1,00,116లు విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి వారిని సత్కరించారు.

దుస్తుల వితరణ

ఆచంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కల్వరి గాస్పెల్ హీలింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలం లోని కొడమంచిలి అరుంధతీ పేట రక్షణ సైన్యం చర్చి దివ్యాంగులు, వితంతువులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖరరాజు, సభ్యులు పాల్గొన్నారు.

బధిర పాఠశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

భీమవరం అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో టీటీడీ నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర బధిర ఉన్నత పాఠశాల పిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులను అసభ్యకర పదజాలంతో ఇబ్బంది పెడుతున్నారన్న ఆరోపణలపై ఆదివారం టీటీడీ విద్యాశాఖ అధికారిణి విజయలక్ష్మి విచారణ నిర్వహించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సిబ్బంది అందరినీ విచారించామని, నివేదికను పై అధికారులు పంపిస్తామన్నారు.

పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరు

భీమవరం క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఖరీదైన ఖాళీ బాటిల్‌లో చీప్ లిక్కర్ నింపి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు తెలిపారు. భీమవరం స్టేషన్ పరిధిలో జనవరిలో ఖాళీ బాటిల్‌లో చీప్ లిక్కర్ పోసి ఎక్కువ రేటుకు అమ్ముతున్న ఆరుగురు సభ్యులను జనవరిలో అరెస్ట్ చేశామని, అయితే ఏ3 ముద్దాయిగా ఉన్న షణ్ముగం ప్రభు అనే వ్యక్తి అప్పట్లో తప్పించుకోగా ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా నెల్లూరు జిల్లా జైలులో షణ్ముగం ప్రభు ఉన్నట్లుగా తేలడంతో పీటీ వారెంట్‌పై నెల్లూరు జైలు నుంచి భీమవరం తీసుకువచ్చినట్లు సీఐ తెలిపారు.

అయినా తీరు మారలేదు..

▸రహదారులపైనే చెత్త
▸2 రోజులకోసారి సేకరణ


టీడీపీ కార్యాలయ సమీపంలో పేరుకున్న చెత్త

నరసాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం... రోడ్లపై చెత్తా, చెదారం లేకుండా చేద్దాం.. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రగా అంటూ హడావిడి చేసే మునిసిపల్ అధికారులు పారిశుధ్యంపై ఆ శ్రద్ధ చూపించడం లేదన్న వాదనలు పట్టణ వాసుల నుంచి వ్యక్తమవుతున్నాయి. గతంలో మాదిరిగా చెత్త సేకరణ పట్టణంలో జరగడం లేదు. రెండ్రోజులకు ఒక్కసారి చెత్తను సేకరిస్తున్నారు. ఇక రోడ్లపై ఎక్కడబడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గతంలో శివారు ప్రాంతాలు, మెయిన్‌రోడ్లకు దూరంగా వీధుల్లో చెత్త కుప్పలు కనిపించేవి. ఇప్పుడు మెయిన్‌రోడ్‌పై పడవేసే చెత్తను కూడా మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది సక్రమంగా సేకరించడం లేదు. రోజువారి చెత్త సేకరణ గాడి తప్పింది. ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ దీనిపై సభ్యులు గళమెత్తుతున్నా అధికారుల్లో మాత్రం మార్పు కనిపించడంలేదు.


నరసాపురం మెయిన్ రోడ్డులో చెత్తకుప్పలు





పాలకొల్లులో మంత్రి నిమ్మల, భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబు.. ఆకివీడు, తాడేపల్లిగూడెంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు

ఆంధ్రుల హృదయాల్లో అమరజీవి

పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వక్తల నివాళి

పాలకొల్లు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు ఆంధ్రుల హృదయాల్లో నిలిచి ఉంటారని వక్తలు పేర్కొన్నారు. గాంధీ బొమ్మల సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తదితరులతో కలిసి పూలమాలలు వేసి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో తెలుగు జాతి అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. తెలుగు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం నిలిపేందుకు 58 రోజులు సత్యాగ్రహం చేసి అశువులు బాసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని అన్నారు. వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కళ్యాణ మండపం వద్ద, ఏఎంసీ రోడ్డులోనూ, గాంధీబొమ్మల సెంటర్ తదితర ప్రాంతాల్లోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో కెనాల్ రోడ్డులోని పొట్టిశ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు ఆపార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

భీమవరం టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయ మని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. అమర జీవి జయంతి సందర్భంగా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మావుళ్ళమ్మ దేవస్థానం వద్ద ఎమ్మెల్యే అంజిబాబు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య యువజన, వర్తక, మండలి సంఘం సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

తణుకు: పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రాష్ట్రపతి రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరణ జరిగిందని, ప్రభుత్వం అధికారికంగా పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించడం గర్వించదగిన విషయమన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆడిటోరియం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, పూర్వాధ్యక్షుడు పేరూరి కాశియ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహోన్నతుడు పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య సంఘ నాయకుడు గుర్రం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మెయిన్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి ఆదివారం ఆర్యవైశ్యులు, వాసవి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సన్నిధి వెంకన్నబాబు, గుర్రం ఈశ్వరరావు, సన్నిధి వెంకటేశ్వరరావు, చుండూరు వెంకన్న పాల్గొన్నారు.

పెనుమంట్ర: పొట్టి శ్రీరాముల త్యాగ ఫలితమే ఆంధ్రప్రదేశ్ ఆవి ర్భావం జరిగిందని నరసాపురం పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం చైర్మన్ అనుమాలశెట్టి రాం బాబు అన్నారు. ఆదివారం ఉదయం మార్టేరు సెంటర్లో వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘ సభ్యులతో కలసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మొగల్తూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు మొగల్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం, గాంధీబొమ్మల సెంటర్‌లలో గల పొట్టి శ్రీరాములు విగ్రహలకు ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గణపవరం: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అఖిలభారత హ్యాండ్‌లూమ్‌బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. గణపవరంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన మాటాడారు.


తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి నివాళి

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పాలకొల్లు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుండి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడానికి విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాలకొల్లు పట్టణం, మండలంలో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసారు. మొత్తంగా 1972 మంది పరీక్షలు రాయనున్నారు. ఏర్పాట్లను మండల విద్యాశాఖాధికారులు గుమ్మళ్ళ వీరాస్వామి, ఆర్ గంగాధర శర్మ పర్యవేక్షిస్తున్నారు.

నరసాపురం టౌన్: పట్టణ, మండలంలోని 8 సెంటర్లలో 2054 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఆదివారం ఎంఈవో పుష్పరాజ్యం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పట్టణంలోని మిషన్ హైస్కూల్, లెనిన్, టేలర్, సికిలి, గౌతమి, కొత్తపల్లి సుబ్బారాయుడు, మండలంలోని ఎల్‌బి చర్ల గురుకుల పాఠశాల, తూర్పుతాళ్ళు హైస్కూల్‌ల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

తణుకు రూరల్: సోమవారం నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు సంబంధించి తణుకు మండలంలో 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో డి. మురళీ సత్యనారాయణ తెలిపారు. తణుకు మండలంలో మొత్తం 2577 మంది విద్యార్థులు హాజరువుతున్నట్లు తెలిపారు. ఇరగవరం మండలంలో 572 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు.

పాలకోడేరు: ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పెనుమత్స శివనాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 704 మంది విద్యార్థులు నాలుగు కేంద్రాలు పాలకోడేరు, మోగల్లు, గొల్లలకోడేరు, శృంగవృక్షం జడ్పీ హైస్కూళ్లలో పరీక్షలు రాస్తారన్నారు.

ఉండి: మండలంలో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు విద్యాశాఖాధికార్లు తెలిపారు. మండలంలో 620 మంది విద్యార్థులు ఉండి హైస్కూల్ ఏ సెంటర్, బి సెంటర్, ఎన్ఆర్‌పి అగ్రహారం హైస్కూల్, ఉప్పులూరు, యండగండి ప్రభుత్వ హైస్కూళ్లలో పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు.


ఉండిలో ర్యాలీ

ఉండి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనపై కలిసికట్టుగా పోరాడుదామని తెలంగాణ జిల్లా నల్గొండకు చెందిన పర్యావరణ ప్రేమికులు చిట్టుపల్లి సురేష్, బోనం రాజులు, ఉండికి చెందిన నల్లా విజయలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ కిరణ్ ప్రసాద్‌లు అన్నారు. ఆదివారం ఉండిలో నల్లా విజయలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ కిరణ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్, క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. గ్రామస్థులకు క్లాత్ సంచులను పంచిపెట్టారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు పోరాడుదాం

పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

మొగల్తూరు: ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ బాటిల్స్, గ్లాసులు, ప్లేట్లు వినియోగించరాదని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం కాళీపట్నం, ముత్యాపల్లి గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీల్లో ఈవోఆర్డీ నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచ్‌లు అడ్డాల సూరిబాబు, కవురు సావిత్రి ఆదినారాయణ మాట్లాడుతూ పైన సూచించిన ప్లాసిక్ వస్తువులు అమ్మితే రూ.2,500లు నుండి రూ. 5 వేలు వరకూ జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

పరిశుభ్రతలో రాయలం ముందుండాలి..

భీమవరం రూరల్: పరిశుభ్రతలో రాయలం పంచాయతీ మొదటి స్థానంలో ఉండాలని, దీనికి ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరం మండలం రాయలంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకూడదని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను కూడా పెంచాలని అన్నారు. అనంతరం మహిళలకు డస్ట్ బిన్స్ అందించి పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే అంజిబాబు సత్కరించారు.

మంత్రి వర్మకు ప్రముఖుల పరామర్శ

భీమవరంటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జిల్లా కలెక్టరు నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్‌తో వర్మ కొద్ది సేపు చర్చించారు. విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆనంద కుమార్, తణుకు మునిసిపల్ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి రేణుక తదితరులు పరామర్శించారు.

భీమవరం అర్బన్: మంత్రి వర్మను ఏఐటీయుసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, రాష్ట్ర నాయకులు నాయుడు ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కారు ప్రమాదం జరిగిన తీరును శ్రీనివాస వర్మ వారికి వివరించారు. మంత్రి ఎఐఎస్ఎఫ్‌లో వారితో కలిసి పనిచేసిన విషయాలను పంచుకున్నారు.


వర్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పితాని

నేడు విద్యార్థులకు పెన్నుల పంపిణీ

భీమవరం టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు స్వామివారి వద్ద పూజలో ఉంచిన పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు ఉదయం 5 గంటల నుంచి అందిస్తామని ఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేలూరి కిరణ్ తెలిపారు.

మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా బుల్లిమస్తాన్

నరసాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన షేక్ బుల్లిమస్తాన్‌ను నియమించారు. ఈయన గతంలో మునిసిపల్ వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. కాంగ్రెస్, వైసీపీల్లో పలు పదవుల్ని నిర్వహించారు. నరసాపురం సొసైటీ అధ్యక్షులుగా కూడా పని చేశారు. ఆయనకు కీలకమైన రాష్ట్ర పదవి ఇవ్వడంపై జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తదితరులు అభినందించారు.




ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు

తణుకు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఇంటింటికి వెళ్లి ఆదివారం ఉచిత వైద్య సేవలందించారు. నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి 9 మంది వృద్ధులకు వైద్య సేవలందించారు. చెరుకూరి బుల్లబ్బాయి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం


మూల స్థానేశ్వరి అమ్మవారు

యలమంచిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యలమంచిలిలో మూలస్థానేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారికి 45 మంది ముత్తయిదువలు పూజలు చేయగా వారికి ఆలయ కమిటీ అమ్మవారి చీరలను అందజేసింది. మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి), ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గౌరీదేవి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

తాడేపల్లిగూడెం రూరల్ (పెంటపాడు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): పెంటపాడు సంఘం మేడ వద్ద నిర్మించిన గౌరీదేవి ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఆదివారం అమ్మవారికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. నాయకులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న తదితరులు పర్యవేక్షించారు.

● మాధవరం గ్రామదేవతల ఆగం సేవ ఆదివారం నిర్వహించారు. పోలేరమ్మ, వయ్యారమ్మ, తుడుపులమ్మ, మహాలక్ష్మమ్మ, మహంకాళమ్మ, మారెమ్మ, దండు మారెమ్మ, పరగంగ, పోతురాజుల గరగలను ఊరేగిస్తూ చలవపెరుగు చల్లుకుంటూ గ్రామస్థులు మెట్టినింటికి సాగనంపారు. ఉగాది సందర్భంగా నిర్వహించే జాతర వేడుకలకు ఉత్సవ కమిటీ సన్నద్ధమవుతోంది. అమ్మవార్లకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

జువ్వలపాలెంలో రాట ఉత్సవం

తాడేపల్లిగూడెం రూరల్: జువ్వలపాలెం గ్రామదేవత పుంతలో ముసలమ్మ వారి జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం రాట పాతి జాతర వేడుకలను ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.

ఆదిలక్ష్మి జాతర ప్రారంభం

భీమవరం టౌన్: గునుపూడి గ్రామ దేవతలు ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ వార్లకు జాతరను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గరగల ఊరేగింపు జరిగింది. పదిరోజులు పాటు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

పోడూరు: జిన్నూరు మడుగు మహాలక్ష్మమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశాదులు అమ్మవారి ఘటాలతో చేసిన నృత్యప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దాతల విరాళాలతో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.


జిన్నూరు మడుగు మహాలక్ష్మి అమ్మవారు

కలవపూడిలో రుద్రయాగం

కాళ్ళ: కలవపూడిలోని ఉమా భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ చండీ సహిత సహస్ర రుద్ర యాగ పూర్వక అష్టోత్తర శతకలశ అభిషేకాలు, సామ్రాజ్య పట్టాభిషేకం, స్వామివారి లీలా కల్యాణం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నసమారాధన జరిగింది.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మొగల్తూరు: మొగల్తూరులోని లాకుపల్లవపాలెం లాంచీల రేవు రోడ్డులో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం పుననిర్మాణంలో భాగంగా ఆదివారం నూతనంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. గ్రామానికి చెందిన తిరుమాని ఏడుకొండలు సీతమ్మ దంపతులచే ఈఅమ్మవారి విగ్రహప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అఖండ అన్న సమారాధన జరిగింది.

అయి భీమవరంలో జాతర ప్రారంభం

ఆకివీడు రూరల్: అయిభీమవరంలో గ్రామ దేవతలైన పోలేరమ్మ, వీర్ల వెంకమ్మ, పోతురాజు జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్లను ఊరేగింపుగా నడివీధికి తీసుకువచ్చి పూరిగుడిసెలో ఉంచారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరు బాపిరాజు దంపతులు జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధనలు

గణపవరం: గణపవరం, పిప్పర గ్రామాల్లో అమ్మవార్ల ఉత్సవాలు ముగింపుగా అఖరిరోజు అన్నసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం గణపవరంలోని దండు మారెమ్మ అమ్మవారి జాతరలో అన్నప్రసాదాన్ని కూడా ఎమ్మెల్యే పత్సమట్ల భక్తులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజును ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, పురప్రముఖులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు, ఉత్సవ కమిటీ నేతలు కాకర్ల విష్ణుశ్రీనివాసరావు, కొనిశెట్టి రమేష్, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంగాలమ్మ వారి ఊరేగింపు

ఉండి: కలిగొట్లలో సంగాలమ్మ జాతర ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆదివారం అమ్మవారిని గ్రామంలోని ఆయా వీధులగుండా ఊరేగింపును జరిపారు. ఈ నెల 23 ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించడం జరుగుతుందని ఆలయకమిటీ వారు తెలిపారు.